


# కడప మనస్సాక్షి
PRGI Reg.No: APTEL/26/A0309
తెలుగు దినపత్రిక
KADAPA MANASSAKSHI - Telugu Daily





వైయస్ఆర్ కడప/అన్నమయ్య | ఎడిటర్ : వసంత శ్రీనివాసుల రెడ్డి | సంపుటి : 01 సంచిక : 223 | శనివారం, 15 ఆగష్టు 2026 | పేజీలు : 4 వెల.రూ.2/-


## డ్వాక్రా మహిళలకు రూ.3 లక్షల చొప్పున స్థిరనిధి రుణం



అమరావతి, ఆగష్టు 14 (మనస్సాక్షి): డ్వాక్రా మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. గ్రామాల్లో ఆహార శుద్ధి పరిశ్రమలను ప్రోత్సహించేందుకు ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ (పీఎంఎఫ్ఎంఈ) పథకాన్ని శ్రీనిధి క్రెడిట్ కో–ఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్‌తో అనుసంధానిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని చెప్పారు. ఈ పథకంలో అర్హత కలిగిన డ్వాక్రా మహిళలకు రూ.3 లక్షల వరకు యూనిట్ వ్యయంతో ఆహార శుద్ధి యూనిట్లను ఏర్పాటు చేసుకునేందుకు రుణాలు అందించనున్నట్లు మంత్రి వెల్లడించారు. మహిళలు పండ్లు, కూరగాయల ప్రాసెసింగ్, చిరుధాన్యాలు, పప్పులు, మసాలాలు, పచ్చళ్లు, పిండి పదార్థాలు, స్నాక్స్ వంటి ఆహార ఉత్పత్తుల తయారీ యూనిట్లను ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. ప్రతి జిల్లాలోని జిల్లా సమాఖ్యలను డిస్ట్రిక్ట్ రిసోర్స్ ఆర్గనైజేషన్‌గా పరిగణించి, వాటి ద్వారా ఆసక్తి, సామర్థ్యం ఉన్న డ్వాక్రా మహిళలను గుర్తించడం జరుగుతుందని మంత్రి పేర్కొన్నారు. మహిళలకు కేవలం రుణం ఇవ్వడమే కాకుండా వారి వ్యాపారం విజయవంతం అయ్యే వరకు ప్రభుత్వం తోడ్పాటు అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ మహిళలకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు స్వయం ఉపాధి, ఆర్థిక సాధికారతకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు.

## సుప్రీంకోర్టులో రాహుల్ గాంధీకి బిగ్ రిలీఫ్.. కేసు కొట్టివేత.



ఢిల్లీ ఆగష్టు 14 (మనస్సాక్షి): కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. వీర్ సావర్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలతో ఆయనపై నమోదైన క్రిమినల్ పరువునష్టం కేసును, అలాగే లక్నో కోర్టు జారీ చేసిన సమన్లను అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. 2022లో మహారాష్ట్రలో జరిగిన ఒక మీడియా సమావేశంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ, వీర్ సావర్కర్ బ్రిటీష్ వారికి సేవకుడిగా ఉండేవారని, అంతేకాకుండా వారి నుంచి పింఛను కూడా తీసుకున్నారని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలు స్వాతంత్ర్య సమరయోధుడిని కించపరిచే విధంగా ఉన్నాయని, సమాజంలో విద్వేషాలను రెచ్చగొట్టేలా ఉన్నాయని ఆరోపిస్తూ ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓ న్యాయవాది కోర్టులో ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా లక్నో కోర్టు రాహుల్ గాంధీకి సమన్లు జారీ చేయగా, దానిని సవాలు చేస్తూ ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

## 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు.. ఏర్పాట్లు పూర్తి..

### –జెండాను ఆవిష్కరించనున్న లోకేష్.




విజయవాడ ఆగష్టు 14 (మనస్సాక్షి): విజయవాడలోని సింగ్ నగర్‌లో ఉన్న మాకినేని బసవ పున్నయ్య స్టేడియంలో శనివారం జరగనున్న 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ జాతీయ జెండాను ఆవిష్కరించి, సభను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఈ వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లను ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం పూర్తి చేసింది. శుక్రవారం స్టేడియంలో జరిగిన పూర్తి స్థాయి రిహార్సల్‌ను జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ, విజయవాడ పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర్ బాబు పరిశీలించారు. జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ ఒక పరేడ్ వాహనంపై నుండి జెండా ఆవిష్కరణ, పోలీస్ పరేడ్, గౌరవ వందనం (గార్డ్ ఆఫ్ ఆనర్), మోటార్‌సైకిల్ విన్యాసాలు, వివిధ ప్రభుత్వ శాఖల కవాతులతో సహా కార్యక్రమాలను పరిశీలించారు. రిహార్సల్‌లో పాల్గొన్న పోలీస్ సిబ్బంది, విద్యార్థులు, అధికారులను వారు అభినందించారు, అలాగే వేడుకలు క్రమశిక్షణతో జరిగేలా చూడాలని అధికారులకు సూచించారు.

## పోలవరం, వెలిగొండ ప్రాజెక్టుల పనుల పురోగతిపై సీఎం సమీక్ష



అమరావతి: పోలవరం, వెలిగొండ ప్రాజెక్టుల పనుల పురోగతిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో కీలక సాగునీటి ప్రాజెక్టుల పనులను వేగవంతం చేసి, నిర్దేశిత లక్ష్యాల మేరకు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పోలవరం ప్రాజెక్టులో ప్రస్తుతం సివిల్ పనులు 89.9 శాతం మేర పూర్తయ్యాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. మిగిలిన పనులను కూడా వేగంగా పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సీఎం సూచించారు. పోలవరం ఎడమ కాలువ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని చంద్రబాబు ఆదేశించారు. గ్రావిటీ–1, గ్రావిటీ–2 ప్రాంతాల్లో పనులను శరవేగంగా చేపట్టి ప్రాజెక్టు లక్ష్యాలను సాధించాలని సూచించారు. కాలువల పనులతో పాటు భూసేకరణ, పునరావాసం తదితర అంశాలపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టుల పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా శాఖల మధ్య సమన్వయంతో ముందుకు సాగాలని సీఎం స్పష్టం చేశారు. సాగునీటి ప్రాజెక్టులు పూర్తయితే రాష్ట్రంలోని ఆయా ప్రాంతాలకు నీటి లభ్యత పెరగడంతో పాటు వ్యవసాయ రంగానికి మరింత ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. సంబంధిత ప్రాజెక్టుల పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎదురవుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు.




## 9 మందికి కీర్తి చక్ర, 19 మందికి శౌర్య చక్ర..

### –79 శౌర్య పురస్కాలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం.



ఢిల్లీ ఆగష్టు 14 (మనస్సాక్షి): భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ సందర్భాన్ని పురస్కరించుకుని సాయుధ దళాలు, కేంద్ర సాయుధ పోలీసు బలగాల (సీఏపీఎఫ్) సిబ్బందికి శౌర్య పురస్కారాల ప్రకటన వెలువడింది. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము... మొత్తం 78 శౌర్య పురస్కారాలకు ఆమోదం తెలిపారు. అయితే 13 మందికి మరణానంతరం ఈ పురస్కారాలు దక్కనున్నాయి. ఈ 78 శౌర్య పురస్కారాలలో 9 మందికి (ఏడుగురికి మరణానంతరం) కీర్తిచక్ర పురస్కారం అందించనున్నారు. ఒకరికి బార్ టు శౌర్య చక్ర పురస్కారం, 19 మందికి (ఒకరికి మరణానంతరం) శౌర్య చక్ర పురస్కారాలు, ఐదుగురికి బార్ టు సేనా మెడల్స్ (శౌర్యం), 36 మందికి (ఐదుగురికి మరణానంతరం) సేనా మెడల్స్ (శౌర్యం), ముగ్గురికి నౌ సేనా మెడల్స్ (శౌర్యం), వాయు సేనా మెడల్స్ (శౌర్యం) ఉన్నాయి. ఈ పురస్కారాలను దేశ రక్షణలో అత్యున్నత ధైర్యసాహసాలు, నిస్వార్థ సేవను ప్రదర్శించిన వీర జవాన్లకు అందిస్తున్న సంగతి తెలిసిందే. అలాగే, 89 మందికి 'మెన్షన్–ఇన్–డిస్పాచెస్' (విశిష్ట సేవా గుర్తింపు)లను కూడా రాష్ట్రపతి ఆమోదించారు. ఇందులో భారత సైన్యానికి చెందిన 75 మంది, భారత నౌకాదళానికి చెందిన 4 గురు, భారత వాయుసేనకు చెందిన 10 మంది సిబ్బంది ఉన్నారు. ఇదిలాఉంటే, స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్ర హోంశాఖ... పోలీసు, ఫైర్ సర్వీసు, హోంగార్డు, సివిల్ డిఫెన్స్, జైళ్ల విభాగాల్లో విశేష సేవలందించిన సిబ్బందికి వివిధ పోలీసు పతకాలను ప్రకటించింది. వివిధ విభాగాలకు చెందిన 1,057 మంది సిబ్బందికి శౌర్య, సేవా పతకాలను అందించనున్నట్టుగా తెలిపింది. ఈ ఏడాది 301 శౌర్య పతకాల (గ్యాలెంట్రీ అవార్డుల)ను ప్రకటించింది ఇందులో 292 పోలీసులు, 29 మంది అగ్నిమాపక సేవా సిబ్బందికి ఉన్నారు. ప్రాణాలను, ఆస్తులను కాపాడటం, నేరాలను అరికట్టడం లేదా నేరస్థులను పట్టుకోవడం వంటి విశిష్టమైన శౌర్య ప్రదర్శనలకు గాను ఈ శౌర్య పతకాన్ని ప్రదానం చేస్తారు. ఇక, విధి నిర్వాహణలో విశిష్ట సేవలు అందించిన మొత్తం 92 మందికి రాష్ట్రపతి విశిష్ట సేవా పతకం ప్రకటించారు. వీటిలో పోలీసు సేవలకు 83, అగ్నిమాపక సేవలకు 4, పౌర రక్షణ, హోమ్ గార్డ్ సేవలకు 3, జైళ్ల శాఖకు 2 పతకాలు ఉన్నాయి. వీటితో పాటు ఈ ఏడాది 664 మందికి మెరిటోసియస్ సేవా పతకాలను ప్రకటించారు. పోలీస్ సర్వీస్–606, అగ్నిమాపక సిబ్బంది–28, సివిల్ డిఫెన్స్ అండ్ హోంగార్డ్స్– 18, జైళ్ల శాఖ–12 మెడల్స్ ఉన్నాయి.

## ఏడాది ముందే విద్యార్థుల ఖాతాల్లోకి నగదు..



హైదరాబాద్ ఆగష్టు 14 (మనస్సాక్షి): రాష్ట్రంలోని పేద విద్యార్థుల చదువుకు ఫీజుల భారం అడ్డుకాకూడదనే లక్ష్యంతో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అమలులో ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి అడ్వాన్స్ గా విద్యార్థుల ఖాతాలో ఫీజు రీయింబర్స్ మెంట్ డబ్బులు జమ చేయబోతున్నామని చెప్పారు. ఈ ఏడాదికి సంబంధించిన ఫీజు రీయింబర్స్ మెంట్ కోసం ఇప్పటికే రూ.250 కోట్లు బ్యాంకు ఖాతాల్లో జమచేశామని భవిష్యత్?లో కళాశాలల్లో ప్రవేశాలు పొందాక ఆన్?లైన్?లో దరఖాస్తు చేసుకున్న నెలలోపు ఫీజు రీయింబర్స్ మెంట్ డబ్బులు విద్యార్థుల ఖాతాలో జమ చేస్తామన్నారు. ఇవాళ ట్యాంక్ బండ్ ఎన్టీఆర్ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలను ఆవిష్కరించిన సీఎం అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. పారదర్శకంగా ఫీజు రీయింబర్స్ మెంట్ పథకం అమలు చేయాలని మా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, ఫీజు కట్టలేదని సర్టిఫికెట్ ఇవ్వమని కాలేజీ యాజమాన్యాలు చెప్పే పరిస్థితి ఇకపై రాబోదన్నారు.

# హెల్మెట్ తప్పనిసరి.. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

-440 కేసులు నమోదు.. రూ. 86,801 జరిమానా



కడప, ఆగష్టు 14 (మనస్సాక్షి): ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐపీఎస్ హెచ్చరించారు. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై 440 కేసులు నమోదు చేసి, రూ. 86,801 జరిమానా విధించినట్లు ఎస్పీ తెలిపారు. ద్విచక్రవాహనదారులు ప్రయాణించే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించే వారు సీట్‌బెల్ట్ పెట్టుకోవాలని ఎస్పీ సూచించారు. రహదారి భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని కోరారు. ముఖ్యంగా రాంగ్‌రూట్ డ్రైవింగ్ ప్రమాదకరమని, దీనివల్ల ప్రాణనష్టం జరిగే అవకాశం ఉందని ఎస్పీ హెచ్చరించారు. రాంగ్‌రూట్‌లో వాహనాలు నడిపే వారిపై ఇకపై మరింత కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యమని, వాహనదారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ కోరారు.

# కడప ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్‌కు అరుదైన గౌరవం

-భారతదేశంలోని 100 మంది ఉత్తమ పోలీసు చీఫ్‌లలో స్థానం




కడప ఆగష్టు 14 (మనస్సాక్షి): వైఎస్ఆర్ కడప జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐపీఎస్‌కు అరుదైన గౌరవం దక్కింది. దేశంలోని అత్యుత్తమ పోలీసు నాయకత్వాన్ని గుర్తించేందుకు ఫేమ్ **India--Asia Post** సంస్థలు నిర్వహించిన 2026 ఎంపికలో భారతదేశంలోని 100 మంది ఉత్తమ పోలీసు చీఫ్‌లలో ఆయన స్థానం సంపాదించారు. సమర్థవంతమైన పోలీసింగ్, శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, ప్రజా భద్రత, ప్రజలకు అనుకూలమైన పోలీసు పరిపాలన వంటి అంశాల్లో ఆయన చూపుతున్న నిబద్ధతకు ఈ గుర్తింపు లభించింది. పోలీసు నాయకత్వం, ప్రజల విశ్వాసం, పారదర్శకత, నూతన విధానాల అమలు, సంక్షోభ నిర్వహణ, ప్రజలకు పోలీసుల స్పందన తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని ఎంపిక చేసినట్లు సంస్థలు పేర్కొన్నాయి. వృత్తి నైపుణ్యంతో కూడిన నాయకత్వం... కడప జిల్లా ఎస్పీగా బాధ్యతలు నిర్వహిస్తున్న షెల్కే నచికేత్ విశ్వనాథ్ వృత్తి నైపుణ్యం, క్రమశిక్షణ, సమర్థవంతమైన పర్యవేక్షణ, క్షేత్రస్థాయి పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇస్తున్నారు. పోలీస్ స్టేషన్ల పనితీరును నిరంతరం పర్యవేక్షించడం, పెట్రోలింగ్‌ను బలోపేతం చేయడం, సిబ్బంది పనితీరును పరిశీలించడం, ప్రజల ఫిర్యాదులపై వేగంగా స్పందించేలా చర్యలు చేపడుతున్నారు. నివారణాత్మక పోలీసింగ్‌పై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తూ పోలీస్ స్టేషన్ల ఆకస్మిక తనిఖీలు, క్షేత్రస్థాయి పర్యవేక్షణ, అత్యవసర సేవలపై నిరంతర సమీక్ష వంటి చర్యలు చేపడుతున్నారు. మహిళలు, బాలల భద్రతకు ప్రాధాన్యం... మహిళలు, బాలలు, బలహీన వర్గాల భద్రతకు ఎస్పీ ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారు. బాధితుల పట్ల సున్నితంగా వ్యవహరించడం, వారి సమస్యలపై తక్షణమే స్పందించడం, ప్రజలకు పోలీసు శాఖను మరింత చేరువ చేయడం ద్వారా ప్రజా అనుకూల పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఆధునిక సాంకేతికతతో పోలీసింగ్... సైబర్ నేరాల నియంత్రణ, ఇంటెలిజెన్స్ ఆధారిత పోలీసింగ్, కమ్యూనిటీ పోలీసింగ్, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, వృత్తిపరమైన దర్యాప్తు వంటి అంశాలపై దృష్టి సారిస్తున్నారు. మారుతున్న నేర పరిస్థితులకు అనుగుణంగా పోలీసింగ్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నారు. కడప పోలీసు శాఖకు గర్వకారణం.. **Fame India--Asia Post** ఎంపికలో దేశంలోని 100 మంది ఉత్తమ పోలీసు చీఫ్‌లలో షెల్కే నచికేత్ విశ్వనాథ్‌కు స్థానం లభించడం ఆయన వ్యక్తిగత ప్రతిభకు మాత్రమే కాకుండా కడప జిల్లా పోలీసు శాఖకు, జిల్లా ప్రజలకు కూడా గర్వకారణంగా నిలిచింది. ఈ గుర్తింపు ఎస్పీ నాయకత్వ సామర్థ్యాలు, వృత్తి నిబద్ధత, ప్రజా సేవ పట్ల అంకితభావానికి లభించిన గౌరవంగా పోలీసు వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ సందర్భంగా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్‌కు జిల్లా ప్రజలు, పోలీసు అధికారులు, సిబ్బంది అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

# స్వాతంత్ర్య దినోత్సవ నేపథ్యంలో కొండాపురం రైల్వే స్టేషన్‌లో భద్రతా తనిఖీలు




కొండాపురం, ఆగష్టు 14 (మనస్సాక్షి): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కొండాపురం రైల్వే స్టేషన్‌లో పోలీసులు విస్తృత భద్రతా తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు కొండాపురం సీఐ పి. రాజా ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ఈ తనిఖీలు చేపట్టారు. రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులు, వారి లగేజీలను పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు, కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. స్టేషన్ పరిసరాలను కూడా పరిశీలించి భద్రతా పరిస్థితులను సమీక్షించారు. తనిఖీల్లో ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లేదా కార్యకలాపాలు గుర్తించలేదని పోలీసులు తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నేపథ్యంలో ప్రజల భద్రతకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసు శాఖ అప్రమత్తంగా ఉందని సీఐ పి. రాజా తెలిపారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన సూచించారు. రైల్వే స్టేషన్లు, రద్దీ ప్రాంతాల్లో భద్రతా చర్యలను నిరంతరం కొనసాగిస్తామని పోలీసులు తెలిపారు.

# 'నా జిల్లా--నా బాధ్యత' భావనతో సమిష్టిగా ముందుకెళదాం

-జిల్లా అభివృద్ధిలో కడపను అగ్రగామిగా నిలిపేందుకు అందరూ భాగస్వాములు కావాలి

-జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి



కడప, ఆగష్టు 14 (మనస్సాక్షి): 'నా జిల్లా--నా బాధ్యత' అనే భావనతో ప్రతి ఒక్కరూ భాగస్వాములై వైఎస్ఆర్ కడప జిల్లాను అభివృద్ధిలో రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలిపేందుకు సమిష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పిలుపునిచ్చారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా ప్రజలకు కలెక్టర్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. మన ఐక్యతే మన బలమని, సమిష్టి కృషితోనే భావితరాలకు బంగారు భవిష్యత్తును అందించగలమని ఆయన పేర్కొన్నారు. ఎందరో మహనీయుల త్యాగాలు, పోరాటాల ఫలితంగా దేశానికి స్వాతంత్ర్యం లభించిందని, వారి త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని దేశం, రాష్ట్రం, జిల్లాను అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, యువత, మహిళలు, రైతులు, విద్యార్థులు సహా అన్ని వర్గాల ప్రజలు సమిష్టిగా పనిచేయాలని కలెక్టర్ ఆకాంక్షించారు. "అభివృద్ధి అనేది ప్రభుత్వం ఒక్కటే సాధించేది కాదు.. ప్రజల భాగస్వామ్యంతోనే అది సంపూర్ణమవుతుంది" అని ఆయన అన్నారు. పచ్చదనం, పరిశుభ్రత, విద్య, వైద్యం, ఉపాధి, పారిశ్రామిక ప్రగతి, మౌలిక వసతుల కల్పనతో పాటు ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందించేందుకు జిల్లా యంత్రాంగం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ హక్కులతో పాటు బాధ్యతలను కూడా గుర్తించి సమాజ శ్రేయస్సు కోసం పనిచేయాలని కలెక్టర్ సూచించారు. స్వాతంత్ర్య స్ఫూర్తితో 'నా జిల్లా--నా బాధ్యత' అనే భావనను అలవరచుకుని జిల్లాను అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపేందుకు సంకల్పం తీసుకోవాలని పిలుపునిచ్చారు.

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలి

-జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా



కడప, ఆగష్టు 14 (మనస్సాక్షి): 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా అధికారులను ఆదేశించారు. కడప పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల కోసం చేపడుతున్న ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా వేదిక, అతిథుల కోసం కుర్చీల ఏర్పాటు, బారికేడింగ్, వాహనాల పార్కింగ్, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, అలంకరణ, స్టాల్స్ తదితర ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లను సంబంధిత శాఖలు సమన్వయంతో పూర్తి చేయాలని సూచించారు. పరేడ్ గ్రౌండ్ పరిసరాల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, తాగునీరు, వైద్య సదుపాయాలను అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్‌కు సంబంధించి ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులకు సూచించారు. కార్యక్రమానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లను నిర్ణీత సమయానికి పూర్తి చేసి, వేడుకలు విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జాయింట్ కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ మురళి, మునిసిపల్ కమిషనర్ భవానీ ప్రసాద్, జిల్లా విద్యాశాఖ అధికారి షంషీద్దీన్, డీఆర్‌డీఏ పీడీ డా. రాజ్యలక్ష్మి, వ్యవసాయ శాఖ జేడీ సుబ్రహ్మణ్య శర్మ, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ చింతామణి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. యుగంధర్‌తో పాటు సంబంధిత జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య వేడుకలకు ముస్తాబైన కడప





కడప, ఆగష్టు 14 (మనస్సాక్షి): 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని జిల్లా కేంద్రం కడప విద్యుత్ దీప కాంతులతో కనువిందు చేస్తోంది. కలెక్టరేట్‌తో పాటు వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, ప్రధాన రహదారులు, కూడళ్లు రంగురంగుల విద్యుత్ అలంకరణలతో సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. త్రివర్ణ పతాకాల శోభ, విద్యుద్దీపాల వెలుగులు నగరానికి పండుగ వాతావరణాన్ని తీసుకొచ్చాయి. రాత్రివేళల్లో వెలుగుల నడుమ మెరిసిపోతున్న ప్రభుత్వ భవనాలు, కూడళ్లు, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరిగే పెరేడ్ గ్రౌండ్ తదితర పరిసరాలు ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటూ దేశభక్తి భావాన్ని పెంపొందిస్తున్నాయి.. స్వాతంత్ర్య వేడుకల వైభవాన్ని ప్రతిబింబించేలా చేపట్టిన ఈ ప్రత్యేక అలంకరణలు జిల్లా ప్రజలను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ స్వాతంత్ర్య స్ఫూర్తిని చాటేలా జిల్లా కేంద్రం పండుగ శోభను సంతరించుకుంది.

కడప మనస్సాక్షి తెలుగు దినపత్రిక
PRGI Reg.No: APTEL/26/A6309
KADAPA MANASSAKSHI - Telugu Daily
శనివారం, 15 ఆగష్టు 2026

# ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే లక్ష్యం

### –చెన్నూరు కొత్త రోడ్డుపై బస్ షెల్టర్ ప్రారంభించిన ఎమ్మెల్యే



చెన్నూరు ఆగష్టు 14 (మనస్సాక్షి): ప్రజల సౌకర్యార్థం చెన్నూరు కొత్త రోడ్డు వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన బస్‌స్టాప్‌ను కమలాపురం శాసనసభ్యులు పుత్తా క్రిష్ణ చైతన్య రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా బస్‌స్టాప్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే ప్రజలకు అందుబాటులో ఉండేలా అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. నూతన బస్‌స్టాప్ అందుబాటులోకి రావడంతో మండలంలోని ప్రయాణికులు, విద్యార్థులు, మహిళలు, వృద్ధులకు ఎలాంటి సమస్యలు కలగకుండా ఉండేందుకు ఈ చర్యలు చేపట్టినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుంచి చెన్నూరు, కమలాపురం తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రజలకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. గతంలో వృద్ధులు, మహిళలు, విద్యార్థులు, వికలాంగులు, బస్సు షెల్టర్ లేక ఎండకు ,వానకు ఎన్నో సమస్యలను ఎదుర్కొనే వారని అలాంటిది ఈ బస్సు షెల్టర్ వల్ల ప్రయాణికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆయన అన్నారు ప్రజల అవసరాలను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రవాణా సౌకర్యాల మెరుగుదలతో పాటు రహదారులు, తాగునీరు, డ్రైనేజీ తదితర మౌలిక వసతుల అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ బస్సు షెల్టర్ నిర్మించినందుకు మండల ప్రజలుఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. నూతన బస్‌స్టాప్ ప్రారంభంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు కల్లూరు విజయ భాస్కర్ రెడ్డి, ఇందిరెడ్డి శివారెడ్డి, గుమ్మల్ల మల్లికార్జున రెడ్డి, ఆవుల పవన్ కుమార్ రెడ్డి, తాడిగొట్ల వెంకటసుబ్బారెడ్డి( బుజ్జన్న) , రాజగోపాల్ రెడ్డి, ఆకుల ప్రసాద్ బాబు, రామకృష్ణారెడ్డి, సుదర్శన్ రెడ్డి, వేల్పుల సుబ్రహ్మణ్యం, భరత్, గుణ, గోదిన శ్రీనివాసులు, మోహన్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, లక్ష్మీనారాయణ, టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఎద్దుల కొండ ఆలయం నందు ఉత్సవ విగ్రహాలు ఉంచుట

### –ఆలయం నందు ఉంచి నిత్య పూజలు నిర్వహించుట.

### –కార్యనిర్వాహణాధికారి కడప.సుభాష్.



వేంపల్లి, ఆగష్టు 14 (మనస్సాక్షి): శ్రీ వృషభాచలేశ్వర స్వామి దేవస్థానం వేంపల్లి పట్టణం, శ్రీ స్వామివారి ఉత్సవ విగ్రహములను ఆగమ సాంప్రదాయం ప్రకారం ప్రధాన ఆలయమైన శ్రీ వృషభాచనేశ్వర స్వామి వారి ఆలయం నందు ఉంచి నిత్యపూజలు నిర్వహించుటకు శ్రీయుత రీజినల్ జాయింట్ కమిషనర్ఆదేశించినందున ,వారి ఆదేశముల ప్రకారం వేంపల్లి పట్టణం నందు శ్రీ ఆంజనేయ స్వామి ఆలయం నందు ఉన్న శ్రీ స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఎద్దుల కొండ ఆలయం నందు ఉంచుటకు నిర్ణయించడమైనది. ప్రతి శనివారము దాతల సహకారంతో అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించబడును. సదరు అన్నప్రసాద వితరణ జరిపించిన దాతల వివరములు దేవస్థాన ము వద్ద ఏర్పాటుచేసిన బోర్డుపై లిఖించి వారి గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి సత్కరించబడును. అదేవిధంగా శ్రావణమాసం సందర్భంగా ఆలయం నందు శ్రీ స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేసి, ప్రత్యేక పూజ లునిర్వహించబడును. శ్రావణమాసం మూడవ శనివారం అనగా 29.08.2026 వ తేదీన శ్రీ శ్రీ స్వామి అమ్మవార్లకు కళ్యాణ కార్యక్రమం నిర్వహించబడును. ఎద్దుల కొండ మెట్ల మార్గం దాతల సహకారంతో అభివృద్ధి పరచుటకు నిర్ణయించడమైనది. ఈ కార్యక్రమం నందు దేవస్థానం చైర్మన్ శ్రీ పి.వి.రమణ , సభ్యులు శ్రీ అద్దంకి రామయ్య, శ్రీమతి జుటూరి జ్యోతి, శ్రీమతి వెంకటసుబ్బమ్మ శ్రీమతి వరలక్ష్మి, దేవస్థానం ముఖ్య అర్చకులు శ్రీహరి ప్రవీణ్ పాల్గొన్నారు.

# తీవ్ర వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు రైతులు ప్రత్యామ్నాయ వ్యవసాయ పద్ధతులను అవలంబించాలి

### –రాష్ట్ర వ్యవసాయ శాఖ అదనపు సంచాలకులు విజయలక్ష్మి.



వేంపల్లి, ఆగష్టు 14 (మనస్సాక్షి): శుక్రవారం నాడు వైఎస్ఆర్ కడప జిల్లా వేంపల్లి మండలం నాగూరు గ్రామంలో రైతులకు శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు ప్రస్తుత ఎల్‌నినో/వాతావరణ మార్పుల ప్రభావంతో ఏర్పడుతున్న అనిశ్చిత వర్షపాతం, దీర్ఘకాలిక వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు పంటల సాగులో తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలనిసూచించారు. వర్షాభావ పరిస్థితుల్లో పంటల సాగుపై సూచనలు తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో రైతులు అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని అధికారులు సూచించారు. వర్షపాతం ఆలస్యమైనప్పుడు లేదా తక్కువగా నమోదైనప్పుడు అధిక నీటి అవసరం ఉన్న పంటలకు బదులుగా తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. విత్తనాలు వేసే ముందు స్థానిక వాతావరణ పరిస్థితులు, నేల స్వభావం, నీటి లభ్యతను పరిగణనలోకి తీసుకొని పంటల ఎంపిక చేసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ అదనపు సంచాలకులు విజయలక్ష్మి రైతులనుఉద్దేశించితెలిపారు. వర్షాలు ఆలస్యమైతే పంట కాలాన్ని బట్టి ప్రత్యామ్నాయ పంటలప్రణాళికరూపొందించుకోవాలని వ్యవసాయ సహాయ సంచాలకులు ప్రభాకర్ రెడ్డి సూచించారు. ఈకార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం సిబ్బంది ఆధ్వర్యంలో విత్తనపు గుళికల తయారీ విధానాన్ని రైతులకు ప్రత్యక్షంగా ప్రదర్శించారు. వర్షాభావ ప్రాంతాల్లో విత్తనాలను సంరక్షిస్తూ అనుకూల వాతావరణ పరిస్థితులు ఏర్పడినప్పుడు మొలకెత్తేలా చేయడంలో విత్తనపు గుళికల ఉపయోగం గురించి రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం అధికారులు, శాస్త్రవేత్తలు రైతుల పొలాలను సందర్శించి వివిధ పంటల పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పంటల పెరుగుదల, నేలలో తేమ, తెగుళ్లు మరియు పురుగుల ఉధృతి, పోషక లోపాలు, నీటి లభ్యత తదితర అంశాలను పరిశీలించి రైతులకు తగిన సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్ కుమార్ , పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రవీంద్రనాథ్ రెడ్డి స్థానిక మండల వ్యవసాయ అధికారి బాలగంగాధర్ రెడ్డి గ్రామ వ్యవసాయ సహాయకులు మహేష్ నాయక్ మరియు ఇతర సిబ్బంది ,రైతులు తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య దినోత్సవ వేళ...

# విద్యుత్ కాంతులతో వెలిగిపోతున్న ఎమ్మార్వో కార్యాలయం...



చెన్నూరు, ఆగష్టు 14 (మనస్సాక్షి): చెన్నూరు మండలం, చెన్నూరు టౌన్ లోని తహసిల్దార్ ఆఫీస్ భారత దేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని చెన్నూరు తహసీల్దారు కార్యాలయం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. జాతీయ పండుగను ఘనంగా చాటిచెప్పేలా, దేశభక్తిని చాటిచెప్పేలా ప్రభుత్వ భవనాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అత్యంత వైభవంగా అలంకరించారు. ఈ కార్యాలయంపై ఏర్పాటు చేసిన ఆకర్షణీయమైన ఎల్ఈడీ కాంతులు చూపరులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. భవనం చుట్టూ అమర్చిన రంగుల దీపాల వెలుతురుతో పరిసర ప్రాంతాలన్నీ దేదీప్యమానంగా మారుతున్నాయి. జాతీయ భావన ఉట్టిపడేలా కార్యాలయ భవనంపై త్రివర్ణ పతాకాలను పోలిన విద్యుత్ అలంకరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు కార్యాలయం పూర్తిగా సిద్ధమైంది. జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి వచ్చే ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారుల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసారు. ఈ సుందరమైన దృశ్యాలను చూసేందుకు స్థానికులు పెద్ద ఎత్తున కార్యాలయం వద్దకు వచ్చి సెల్ఫీలు, ఫోటోలు దిగుతూ సందడి చేస్తున్నారు. విద్యుత్ కాంతులతో వెలిగిపోతున్న ప్రభుత్వ కార్యాలయం స్థానికంగా ప్రత్యేక చర్చనీయాంశంగా మారింది.

# శ్రీరామ దేవాలయం, నగరిగుట్ట స్వర్ణ గ్రామ కార్యాలయాల్లో ఆకస్మిక తనిఖీ -- బీటెక్ రవి



పులివెందుల, ఆగష్టు 14 (మనస్సాక్షి): పులివెందుల నియోజకవర్గంలోని శ్రీరామ దేవాలయం, నగరిగుట్ట స్వర్ణ గ్రామ కార్యాలయాలను రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి , రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశాను. గ్రామ కార్యాలయంలో ప్రజలకు అందుతున్న సేవలను స్వయంగా అడిగి తెలుసుకున్నాను. గ్రామంలోని డ్రైనేజీ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించానరు .తల్లికి వందనం నిధులు అందలేదని లబ్ధిదారులు తెలియజేయడంతో ఎంఈవోను ఫోన్‌లో సంప్రదించి వివరాలు అడిగి తెలుసుకున్నాను. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించడం జరిగింది.

# శ్రీ గణపతి ఆలయ అభివృద్ధిని అడ్డుకుంటే సహించేది లేదు

### –ఫ్యాక్టరీ సిబ్బంది ఆంక్షలపై గ్రామస్తుల ఆగ్రహం



చెన్నూరు: ఆగష్టు 14 (మనస్సాక్షి): మండలంలోని దౌలతాపురం గ్రామంలోని ఫ్యాక్టరీ సమీపంలో ఉన్న శ్రీ గణపతి ఆలయ అభివృద్ధికి అడ్డంకులు సృష్టిస్తే ఇకపై సహించేది లేదని గ్రామస్తులు తీవ్రంగా హెచ్చరించారు. ఎన్నో సంవత్సరాలుగా నిర్లక్ష్యానికి గురైన ఆలయాన్ని గ్రామస్తులంతా ఒక్కటై అభివృద్ధి చేసుకుంటుంటే, అందుకు అడ్డుపడటం దుర్మార్గమైన చర్యగా వారు అభివర్ణించారు. 1980లో రైతులు, కార్మికుల సహకారంతో నిర్మించిన ఆలయం 1980 సంవత్సరంలో అప్పటి రైతులు, కార్మికుల సహకారంతో శ్రీ గణపతి ఆలయాన్ని నిర్మించారని గ్రామస్తులు తెలిపారు. ఆ రోజుల్లో ఆలయంలో వినాయక స్వామివారికి అంగరంగ వైభవంగా పూజా కార్యక్రమాలు నిర్వహించేవారని గుర్తుచేశారు. ఫ్యాక్టరీ మూతపడిన అనంతరం ఆలయాన్ని పట్టించుకునే నాథుడు లేకపోవడంతో ఆలయం క్రమంగా నిర్లక్ష్యానికి గురైందన్నారు. ఇటీవల దౌలతాపురం గ్రామ పెద్దలు, యువత ముందుకు వచ్చి ఆలయాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించుకున్నారు. ఎవరినీ ఆశ్రయించకుండా, ఎవరి నుంచి ప్రభుత్వ నిధులు కోరకుండా, గ్రామస్తుల చందాలతోనే ఆలయానికి విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేసి, చుట్టుపక్కల కంపచెట్లను తొలగించి పరిశుభ్రంగా తీర్చిదిద్దారు. ప్రతిరోజూ పూజా కార్యక్రమాలను కూడా గ్రామస్తుల సహకారంతో నిర్వహిస్తున్నారు. అభివృద్ధి చేస్తుంటే ఆంక్షలు ఎందుకు? అయితే ఆలయం అభివృద్ధి చెందడాన్ని చూసి కొందరు ఫ్యాక్టరీ సిబ్బంది, తాము ఫ్యాక్టరీ ఇన్‌చార్జ్‌లమంటూ వివిధ ఆంక్షలు విధిస్తూ ఆలయ అభివృద్ధి కార్యక్రమాలకు ఆటంకం కలిగిస్తున్నారని గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఏళ్ల తరబడి ఆలయాన్ని పట్టించుకోనప్పుడు లేని ఆంక్షలు.. గ్రామస్తులు చందాలు వేసుకుని ఆలయాన్ని అభివృద్ధి చేస్తుంటే ఇప్పుడు ఎందుకు?" అని ప్రశ్నించారు. ఆలయం ఎవరి వ్యక్తిగత ఆస్తి కాదని, గ్రామ ప్రజల భక్తి విశ్వాసాలకు సంబంధించినదని స్పష్టం చేశారు. కులమతాలకు అతీతంగా గ్రామస్తులంతా కలిసి ఆలయాన్ని అభివృద్ధి చేసుకుంటుంటే అడ్డుకోవడం తగదన్నారు. అడ్డుకుంటే పై అధికారులను ఆశ్రయిస్తాం ఆలయ అభివృద్ధి పనులకు ఇకపై ఎలాంటి ఆటంకాలు కల్పించినా గ్రామస్తులు మౌనంగా ఉండబోరని హెచ్చరించారు. అవసరమైతే సంబంధిత శాఖల ఉన్నతాధికారులను కలిసి పూర్తి వివరాలను తెలియజేసి, ఆలయ అభివృద్ధికి చట్టబద్ధమైన మార్గంలో పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. "దేవుడి ఆలయ అభివృద్ధిని అడ్డుకునే హక్కు ఎవరికీ లేదు. గ్రామస్తుల ఐక్యతను తక్కువ అంచనా వేయవద్దు. ఆలయ అభివృద్ధి ఆగదు.. ఎన్ని అడ్డంకులు వచ్చినా వెనక్కి తగ్గేది లేదు" అని గ్రామస్తులు తేల్చిచెప్పారు. ఈ కార్యక్రమంలో దౌలతాపురం గ్రామ దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామ యువతతో పాటు తుపాకుల జనార్దన్ రెడ్డి, మడతల నాగ సుబ్బారెడ్డి, గణపతి కరుణాకరన్, గోపిరెడ్డి సుబ్బారెడ్డి, లక్ష్మీనారాయణ, ప్రసాద్, రవి, సతీష్, వంశీధర్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, పవన్, మధు, అరుణ్, శేఖర్, మౌలాలి, చందు తదితరులు పాల్గొన్నారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై ఆలయ అభివృద్ధికి తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

## కడప స్మార్ట్ కిచెన్లకు నీతి ఆయోగ్ ప్రశంసలు.. గర్వకారణం! : మంత్రి నారా లోకేష్

కడప, ఆగష్టు 14 (మనస్సాక్షి):: వైఎస్ఆర్ కడప జిల్లాలో అమలు చేస్తున్న స్మార్ట్ కిచెన్ల విధానాన్ని నీతి ఆయోగ్ ప్రశంసించడం జిల్లాకు గర్వకారణమని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా స్పందించారు. కడప జిల్లాలోని 38 స్మార్ట్ కిచెన్ల ద్వారా ప్రతిరోజూ దాదాపు లక్ష మంది విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికాహారం అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. భోజన నాణ్యత, పోషక విలువలు, పరిశుభ్రతతో పాటు నిరంతర పర్యవేక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలులో జిల్లా యంత్రాంగం అనుసరిస్తున్న ఆధునిక సాంకేతిక విధానాలను నీతి ఆయోగ్ ప్రత్యేకంగా గుర్తించిందని పేర్కొన్నారు. ముఖ్యంగా భోజన తయారీ, సరఫరా మార్గాల పర్యవేక్షణ, నాణ్యత నియంత్రణ వంటి అంశాల్లో చేపడుతున్న చర్యలను ప్రశంసించిందన్నారు. "విద్యార్థి జీవితంలో పాఠశాల భోజనం ఎంతో కీలకం. దాని నాణ్యత, పోషక విలువలు, పరిశుభ్రత, క్రమబద్ధతను మెరుగుపరచడం మా బాధ్యత" అని నారా లోకేష్ పేర్కొన్నారు. కడప స్మార్ట్ కిచెన్ల విధానాన్ని దేశవ్యాప్తంగా అనుసరించదగిన ఆదర్శ విధానంగా నీతి ఆయోగ్ గుర్తించడం జిల్లాకు మరింత ప్రతిష్టను తీసుకొచ్చిందన్నారు. స్మార్ట్ కిచెన్లను గుర్తించి ప్రశంసించినందుకు నీతి ఆయోగ్‌కు మంత్రి నారా లోకేష్ కృతజ్ఞతలు తెలిపారు.

# గురుమూర్తి తోట వీధిలో సీసీ రోడ్డు, డ్రైనేజీ ఏర్పాటు చేయాలి

**-మానవత జిల్లా సంయుక్త కార్యదర్శి డాక్టర్ యోగీశ్వర బాబు.**



వేంపల్లె, ఆగష్టు 14 (మనస్సాక్షి): వేంపల్లె పట్టణంలోని పులివెందుల రోడ్డులో గురుమూర్తి తోట వీధి లోని టైల్స్ మౌలా సందులో రోడ్డు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మానవత స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా సంయుక్త కార్యదర్శి డాక్టర్ యోగీశ్వర బాబు , నేతి శంకర్ లు స్థానిక ప్రజలతో కలిసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. శుక్రవారం వేంపల్లె కు వచ్చిన మంత్రి ని కలిసి తమ బాధలను విన్నవించారు. గత 18 సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో నివాసం ఉంటున్నామని, సుమారు 17 సంవత్సరాల క్రితం వేసిన సీసీ రోడ్డు ప్రస్తుతం పూర్తిగా దెబ్బతిన్నదని వారు తెలిపారు. మూడు సంవత్సరాల క్రితం వాటర్ పైపులైన్ కోసం రోడ్డు తవ్వడంతో పరిస్థితి మరింత అధ్వానంగా మారిందన్నారు. వర్షాలు కురిసిన సమయంలో ఇళ్ల ముందు నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఈ వీధిలో డ్రైనేజీ వ్యవస్థ కూడా లేకపోవడంతో సమస్య మరింత తీవ్రంగా ఉందన్నారు. కావున మీరు స్పందించి టైల్స్ మౌలా సందులో నూతన సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంతో పాటు డ్రైనేజీ కాలువ ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు యోగీశ్వర బాబు , నేతి శంకర్, శివారెడ్డి, ప్రకాష్ రెడ్డి, ఎల్లారెడ్డి, బయపురెడ్డి, భాస్కర్ రెడ్డి, రాజేష్ తదితరులు కలిసి మంత్రిని కోరారు.

# మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు భూపేష్ రెడ్డితో కలిసి శ్రీ గండి వీరాంజనేయస్వామిని దర్శించుకున్న బీటెక్ రవి



గండి, ఆగష్టు 14 (మనస్సాక్షి): పులివెందుల నియోజకవర్గంలో పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన రాష్ట్ర రోడ్లు, రవాణా శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి గారు, కడప జిల్లా టీడీపీ అధ్యక్షులు భూపేష్ రెడ్డి గారితో కలిసి శ్రావణ మాసం సందర్భంగాఈరోజు వేంపల్లిలోని శ్రీ గండి వీరాంజనేయస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు బీటెక్ రవి నిర్వహించారు .ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, అజ్జగుట్టు రఘునాథరెడ్డి, మునిరెడ్డి, క్లస్టర్ మహమ్మద్, కల్లూరి వెంకటస్వామి, డీఎస్పీ మురళి నాయక్,గంగాధర్ రెడ్డి, తదితరకార్యకర్తలు, పాల్గొన్నారు.

# ప్రజా దర్బార్‌లో అర్జీల స్వీకరణ.. సమస్యల పరిష్కారానికి హామీ

**-బీసీ జనార్దన్ రెడ్డి, బీటెక్ రవి**



పులివెందుల, ఆగష్టు 14 (మనస్సాక్షి): పులివెందుల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్‌లో రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, కడప జిల్లా టీడీపీ అధ్యక్షులు భూపేష్ రెడ్డి తో కలిసిపులివెందుల టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజల నుంచి వివిధ సమస్యలపై అర్జీలను స్వీకరించి, న్యాయబద్ధమైన సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చానరు .తక్షణ పరిష్కారం అవసరమైన సమస్యలపై అధికారులతో ఫోన్‌లో మాట్లాడి చర్యలు తీసుకోవాలని ఆదేశించాను. జిల్లా స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లాల్సిన సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లి, ప్రజలకు న్యాయం జరిగేలా పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపానరు .

# కృష్ణానదీ యాజమాన్య బోర్డు కార్యాలయాన్ని వెంటనే ఆంధ్రప్రదేశ్ కు తరలించాలి

**-గండికోట, వెలిగొండ ప్రాజెక్టుల ముంపు గ్రామాల నిర్వాసితుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి.**

**-డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి.**



వేంపల్లి, ఆగష్టు 14 (మనస్సాక్షి): కృష్ణానదీ యాజమాన్య కార్యాలయాన్ని ఆంధ్రప్రదేశ్లో ఏర్పాటు చేయకపోవడం కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నిర్లక్ష్యానికి, రాష్ట్రంలోని ప్రాంతీయ పార్టీలైన టిడిపి, వైకాపా ప్రభుత్వాల అసమర్థతకు మచ్చుతునక అని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం వేంపల్లి లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలో సెక్షన్ 85 ప్రకారం రాష్ట్ర విభజన జరిగిన 6 నెలల లోపల కేంద్ర ప్రభుత్వం కృష్ణా నదీ యాజమాన్యం బోర్డును,గోదావరి నదీ యాజమాన్య బోర్డును ఏర్పాటు చేయాలి. కృష్ణానది యాజమాన్యం బోర్డు కార్యాలయాన్ని ఆంధ్రప్రదేశ్ లో,గోదావరి నది యాజమాన్య బోర్డ్ కార్యాలయాన్ని తెలంగాణలో ఏర్పాటు చేయాలి.కానీ దురదృష్టవశాత్తు కేంద్ర ప్రభుత్వం రెండు కార్యాలయాలను తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాదులోనే ఏర్పాటు చేసింది. 12 సంవత్సరాలైనా కృష్ణా నది యాజమాన్య బోర్డు కార్యాలయాన్ని ఆంధ్రప్రదేశ్ కు తరలించలేదు. ఇప్పటికీ తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాదులోని జలసౌద లోనే ఉంది.

# కడపలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

కడప, ఆగష్టు 14 (మనస్సాక్షి): 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కడప జిల్లాలో శనివారం పలు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. న్యూ కలెక్టరేట్‌లో ఉదయం 7.30 గంటలకు జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా, జిల్లా రెవెన్యూ అధికారి మల్లికార్జునుడు, కలెక్టరేట్ అధికారులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొననున్నారు. అనంతరం ఉదయం 9 గంటలకు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో రాష్ట్ర రోడ్లు, భవనాలు, మౌలిక సదుపాయాలు మరియు పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. అనంతరం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరితో పాటు ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, సిబ్బంది, ప్రజలు తదితరులు హాజరుకానున్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

# భవన నిర్మాణ కార్మికుల సమస్యలపైన కలెక్టర్ కార్యాలయం వద్ద ఆగస్టు 18న ఆందోళన : ఎఐటియుసి



వేంపల్లి, ఆగష్టు 14 (మనస్సాక్షి): కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని స్కీం కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని ఆగస్టు 18న ఏఐటీయూసీ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా కడప కలెక్టర్ కార్యాలయం వద్ద జరుగు ఆందోళనను జయప్రదం చేయాలని ఏఐటీయూసి భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బళ్లారాపు రామాంజనేయులు, మండల అధ్యక్షుడు దస్తగిరి, మండల కార్యదర్శి సి. బాలాజీ లు విజ్ఞప్తి చేశారు.భవన నిర్మాణ కార్మికులకు రావాల్సిన పెండింగ్ లో ఉన్న క్లెయిమ్ లు వెంటనే చెల్లించాలని,ప్రమాదం జరిగిన వ్యక్తికి 100000 ఇవ్వాలని,సాధార మరణానికి 200000,పెళ్ళి కనుక కి 70000,డెలివరీ కి 50000,మట్టి ఖర్చులకు 50000,పాత పద్ధతిలో కార్డులు ఇవ్వాలని,రెన్యువల్ కూడా పాత పద్ధతిలో చెయ్యాలని కోరుతున్నాము.శుక్రవారం వేంపల్లె లో నాలుగు రోడ్ల అడ్డ లో నిర్వహించిన ఆగస్టు 18 తలపెట్టిన ఆందోళన కార్యక్రమం సంబంధించిన కరపత్రాలను విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏ రంగంలో పనిచేసే కార్మికునికైనా కనీస వేతనం 26 వేలు చెల్లించాలని కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ అమలు చేసి, రెగ్యులర్ చేయాలని నెలల తరబడి బకాయి పెట్టిన స్కూలు ఆయాల, పంచాయతీ కార్మికుల వేతనాలను తక్షణం చెల్లించాలనీ డిమాండ్ చేశారు. ఇటీవల 8 గంటల పనిని 10 గంటలకు పెంచుతూ అసెంబ్లీలో తీర్మానం చేయడాన్ని కార్మికులు ఉద్యోగులు గుర్తుపెట్టుకోవాలన్నారు, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెచ్చిన లేబర్ 44 కార్మిక చట్టాలలో మార్పులు నాలుగు కోడ్ల ఫలితంగా పరిశ్రమల్లో అధికారుల తనిఖీలను జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రిలలో పనిచేసే శానిటేషన్ సెక్యూరిటీ గార్డుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా, కాంట్రాక్టర్లు కార్మికచట్టలను గౌరవించి అమలు జరిగేలా జిల్లా కలెక్టర్ బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బళ్లారపు రామాంజనేయులు , మండల అధ్యక్షుడు దస్తగిరి,మండల కార్యదర్శి బాలాజీ, వల్లెపు బుజ్జి,చలపతి,బాబా ఫ్రకృద్దీన్, గోపాల్, గంగయ్య, నాగరాజు,సుబ్బరావు లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఉలిమెల్లలో 'ఫ్రైడే -- డ్రైడే' కార్యక్రమము

**-ఇంటింటా ఫీవర్, లార్వా సర్వే నిర్వహణ.**

**-పరిసరాల పరిశుభ్రతతోనే దోమల నివారణ:**

**-సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య.**



పులివెందుల, ఆగష్టు 14 (మనస్సాక్షి): పరిసరాల పరిశుభ్రత పాటించకపోతే దోమల వ్యాప్తి పెరిగి తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య పేర్కొన్నారు. పులివెందుల అర్బన్ పరిధిలోని ఉలిమెల్ల గ్రామంలో సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది విస్తృతంగా ఇంటింటా ఫీవర్ (జ్వరం), లార్వా సర్వే నిర్వహించారు.?ఈ సందర్భంగా సిబ్బంది ప్రతి ఇంటినీ సందర్శించి, ఎవరికైనా జ్వరం, ఒళ్లు నొప్పులు వంటి లక్షణాలు ఉన్నాయా అని వివరాలు సేకరించారు. ఇళ్ల పరిసరాల్లో నిల్వ ఉన్న నీటి తొట్లు, డ్రమ్ములు, పాత టైర్లు, కూలర్లను పరిశీలించి లార్వా ఉనికిని గుర్తించారు. ?ఈ సందర్భంగా సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య మాట్లాడుతూ,"వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా వంటి సీజనల్ వ్యాధులు వేగంగా వ్యాపించే అవకాశం ఉంది. వీటికి ప్రధాన కారణం నిల్వ నీటిలో పెరిగే దోమలే. కాబట్టి ప్రతి ఒక్కరూ తమ ఇళ్లతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. వారానికి ఒకరోజు 'డ్రై డే'గా పాటించి, నీటి పాత్రలను శుభ్రం చేసి ఎండబెట్టాలి. నీటి నిల్వ పాత్రలపై తప్పనిసరిగా మూతలు ఉంచాలి. రాత్రి వేళల్లో దోమతెరలు వాడటం శ్రేయస్కరం. జ్వరం లేదా ఇతర అనారోగ్య లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించి ఉచిత వైద్య సేవలు పొందాలి అని సిద్దయ్య తెలిపారు.?ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు శేషగిరి నాయక్, నాగేశ్వరి, ఆశా కార్యకర్త ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

# మంత్రులకు వినతి పత్రం అందజేసిన మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి సుష్మ



వేంపల్లి, ఆగష్టు 14 (మనస్సాక్షి): వేంపల్లి నాలుగు రోడ్ల కూడలి నుండి గండి రోడ్డు బైపాస్ వరకు వుండే సిమెంట్ రోడ్డును అభివృద్ధి చేయాలని కోరుతూ రోడ్డు భవనాల శాఖ మంత్రి శ్రీ బి.సి. జనార్దన్ రెడ్డి కి బిజెపి మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి .సుష్మ పత్రం అందజేసింది.పులివెందుల నియోజకవర్గంలోని వేంపల్లి పట్టణం అడ్డరోడ్డు గుండా వెళుతున్నటువంటి వేంపల్లి- గండి రోడ్డు రహదారి సరిగా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతం ప్రభుత్వంలో ఈ రహదారి మంజూరు అయ్యి రద్దు చేయబడింది. కొంచెం వరకు జరిగిన రోడ్డు విస్తరణలో భాగంగా డ్రైనేజీ వ్యవస్థ గానీ, ఇక్కడ ఉన్న రోడ్డుని పగలగొట్టి అస్తవ్యస్తంగా తయారు అయ్యిందని ఇప్పుడు కడప రోడ్ ఎత్తు పెరగడం వలన వానాకాలంలో నీళ్లు నిలిచే ప్రమాదముందని తెలిపారు. అలాగే రాయసీమలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన శ్రీ గండి వీరాంజనేయస్వామి స్వామి వారి గుడికి ఈ మార్గం గుండానే వెళ్ళాలి మరియు ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీవిద్యా సంస్థకు కూడా ఈ మార్గం ద్వారానే వెళ్ళాలి. రోజుకు కొన్ని వందల వాహనాలు ఈ మార్గం గుండా వెళ్లాలంటే వాహదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గంలో వుండే డ్రైనేజీ వ్యవస్థ కూడా సరిగా లేదు. కనుక త్వరలో ఈ వేంపల్లి లో గండి రోడ్డును తిరిగి మంజూరు చేసి, రహదారిని అభివృద్ధి చేసి వేంపల్లి పట్టణ ప్రజలను ఈ సమస్య నుండి ఉపశమనం చేయవలసినదిగా మంత్రి గారిని కోరడం జరిగింది. మంత్రి గారు వెంటనే స్పందించి సంబంధిత అధికారులకు చెప్పి రిపోర్ట్ చెప్పించుకుని సమస్యకు త్వరలోనే పరిస్కారం దిశగా కృషి చేస్తామని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమం లో బిజెపి జిల్లా ట్రేడ్ సెల్ కన్వీనర్ సుమన్, బిజెపి మండల అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి , మండల మహిళా మోర్చా అధ్యక్షురాలు మాధవి, జిల్లా మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు సౌభాగ్య తదితరులు పాల్గొన్నారు.

Editor, Printed, Published and Owned by VASANTHA SREENIVASULA REDDY, DOOR NO. 41/1077, SANKARAPURAM, KADAPA, Y.S.R., ANDHRA PRADESH - 51600. RNI REG NO:- APTEL/26/A0309.
Printed at. VSAR PUBLICATIONS, DOOR NO. 41/1077, SANKARAPURAM, KADAPA, Y.S.R., ANDHRA PRADESH - 516002. Editor: VASANTHA SREENIVASULA REDDY, E-mail: sreenu1167@gmail.com, Cell: +91 8341698284